సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
9705347494
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విద్యార్థులకు సామగ్రి వితరణ



బ్యాగులు, పుస్తకాలతో విద్యార్థులు

పద్మనాభం: విద్యార్థులు బాగా చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ అన్నారు. ఎస్‌వోఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా మండలంలోని కురపల్లిలో 84 మంది విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను మాన్పించకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. ఎస్‌వోఎస్ ప్రోగ్రామ్ మేనేజర్ కర్రాతు దుర్గరాజు మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా తమ సంస్థ పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.శ్రావణి, యానిమేటర్ జానకి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందిస్తున్న జెడ్పీ ప్రేమ ప్రసన్నవాణి

కొమ్మాది: ఇటీవల విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను చిత్తశుద్ధితో నిర్వహించిన పారిశుధ్య కార్మికులకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. జీవీఎంసీ కమిషనర్ డా.సంపత్ కుమార్ ఆదేశాల మేరకు 4వ వార్డు పారిశుధ్య కార్మికులకు ఉప్పాడ సచివాలయం వద్ద జెడ్పీ ప్రేమ ప్రసన్నవాణి, కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు వీటిని అందజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మి నాయుడు, సూపర్‌వైజర్లు అమ్మోరు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వయోజనులందరూ అక్షరాస్యులు కావాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: వయోజనులందరినీ సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం ఉల్లాస్–నవభారత్ సాక్షరత కార్యక్రమంపై వలంటీర్లకు నిర్వహించిన ఒక రోజు శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ 15 నుంచి 59 ఏళ్ల లోపు గలవారంతా వారంతట వారే పుస్తకాలు, పత్రికలు చదవగలిగేలా చేయాలన్నారు. ఉల్లాస్‌ను విజయవంతం చేసి పద్మనాభం మండలాన్ని జిల్లాలోకి ప్రథమ స్థానంలో నిలిచేటట్లు వలంటీర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఏపీఎంలు సాయి రమేష్, లక్ష్మి పాల్గొన్నారు.

గురుస్వామి ఆకెళ్లకు నివాళులు



నరసింహమూర్తికి నివాళులర్పిస్తున్న స్వాములు

తగరపువలస: దివంగత గురుస్వామి, చిట్టివలస జ్యూట్‌మిల్లు అర్చకుడు ఆకెళ్ల నరసింహమూర్తి 64వ జయంతిని ఆలయ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. భీమిలి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆయన శిష్యగణం పాల్గొని ఆధ్యాత్మిక రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గురుస్వాములను సన్మానించి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన బీజేపీ నాయకుడు ఆకెళ్ల సూరిబాబు, అర్చకులు రవిగణేష్, భాగ్యరాజా, బీవీ చలపతిరావు, గంగ్రేటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214

అదరహో అతివల మార్టు

- వైఎస్సార్‌సీపీ హయాంలో ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఏర్పాటు
- రూ.64.66 లక్షల సొంత నిధులతో నిర్మాణం
- తొమ్మిది నెలలకే రూ.8.40 లక్షల లాభాలు
- ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు



మహిళా మార్టులోని వినియోగ వస్తువులు



పద్మనాభంలోని మహిళా మార్టు

పద్మనాభం: మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏదీ ఉండదు. ఆటంకాలెదురైనా ధైర్యంగా ఎదుర్కొని, తమ ఆశయాన్ని నెరవేర్చుకుంటారు. ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది మండల మహిళా సమాఖ్య పద్మనాభంలో నిర్వహిస్తున్న మహిళా మార్టు. ఈ మార్టును ఆర్థిక స్వావలంబన దిశగా నడుపుతూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు సభ్యులు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది జనవరి 28వ తేదీన మండల మహిళా సమాఖ్య ఈ మార్టును ఏర్పాటు చేసింది. ఏర్పాటు చేసిన తొమ్మిది నెలలకు రూ.8,40,704 లాభాలను ఆర్జించింది. మండలంలో 1425 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లోని 14,056 మంది మహిళలు రూ.64,66,933 తమ సొంత నిధులతో ఈ మార్టును ఏర్పాటు చేసుకున్నారు. సంఘంలో ఉన్న ఒక్కొక్క మహిళ తమ వాటాగా రూ.460 ఇచ్చారు. వివిధ కార్పొరేట్ వాణిజ్య సంస్థల నుంచి కొనుగోలు చేసి మార్టులో పెట్టిన వస్తువులతో పాటు తాము తయారు చేసిన వస్తువులను ఈ మార్టులో అమ్మాలన్న సదుద్దేశంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఈ మార్టును ఏర్పాటు చేశారు. ఈ మార్టులో గృహ అవసరాలకు ఉపయోగపడే వినియోగ వస్తువులు 1074 రకాలు అమ్ముతున్నారు. 10,163 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతరులు ఈ మార్టులో రూ. 2,05,32,771 విలువ చేసే వస్తువులను కొనుగోలు చేశారు. ఖర్చులన్నీ పోను రూ 8,40,704 లాభం వచ్చింది. ఏడాదికోసారి ఈ లాభాల సొమ్మును స్వయం సహాయక సంఘాల సభ్యుల ఖాతాల్లో వేస్తారు.

నాణ్యమైన వస్తువులను సరసమైన ధరలకు అమ్మడంతో వినియోగదారులు ఎక్కువగా ఈ మార్టులో వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. స్వయం సహాయక సంఘాలు తాము తయారు చేసిన వస్తువులను మార్టు ద్వారా విక్రయించి, ఆర్థికంగా పరిపుష్టి చెందాలన్నది మండల మహిళా సమాఖ్య ధ్యేయం. ప్రాథమికంగా ఆనందపురం మండలం స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన అప్పడాలు, పప్పుండలు, పద్మనాభం మండలం రౌతులపాలెం స్వయం సహాయక సంఘం తయారు చేసిన ఫినాయిల్, యాసిడ్లు మార్టులో అమ్ముతున్నారు.

పట్టణాలకు దీటుగా..

పట్టణాల్లో ఉన్న డీ మార్టుకు దీటుగా పద్మనాభం మహిళా మార్టు ఉంది. కొనుగోలు చేసిన వస్తువులను వేసుకునేందుకు ట్రాలీ బండ్లు, బాస్కెట్‌లు అందుబాటులో ఉంచారు. కొనుగోలు చేసిన వస్తువులకు స్వైపింగ్ మిషన్ ద్వారా బిల్లింగ్ చేస్తారు. మార్టులో నలుగురు సిబ్బంది పని చేస్తున్నారు. వీరిని కూడా స్వయం సహాయక సంఘాల సభ్యులే నియమించారు. సేల్స్ మేనేజర్ ఒకరు, సేల్స్ ఉమెన్ ఇద్దరు, ఒక అటెండర్ పని చేస్తున్నారు.



మహిళా మార్టు నుంచి వస్తువులు కొనుగోలు చేసి తీసుకువెళ్తున్న మహిళలు

తక్కువ ధరకు వస్తువులు



పద్మనాభం మహిళా మార్టులో తక్కువ ధరలకు వస్తువులు అభిస్తున్నాయి. బయట షాపుల్లో కన్నా ఈ మార్టులో సరసమైన ధరలకు వస్తువులు లభిస్తున్నాయి. నేను ఈ మార్టులో వస్తువులను కొనుగోలు చేశాను. మైసూర్ శాండిల్ మూడు సబ్బులు ఉన్న ప్యాక్ బయట షాపుల్లో రూ.232 అమ్ముతున్నారు. మార్టులో రూ.220కు లభిస్తున్నాయి. రూ.12 తగ్గుతుంది.

– ఎం.రజని, విజయానందపురం

క్వాలిటీ బాగుంది



మహిళా మార్టులో నాణ్యమైన వస్తువులు లభిస్తున్నాయి. బయటికి ఎక్కడికీ వెళ్లకుండా గృహ అవసరాలకు ఉపయోగపడే బియ్యం, నూనె, పప్పులు వంటి అన్ని రకాల వస్తువులు అభిస్తున్నాయి. గ్రామాల్లో ఇంటికి అవసరమయ్యే కొన్ని వస్తువులు దొరకవు. కానీ అన్ని వస్తువులు మార్టులో లభ్యమవడంతో ఒకే చోట అన్నీ కొనుక్కుని ఇంటికి వెళ్తున్నాం.

– పి.గౌరి, పొట్నూరు

ఎస్‌హెచ్‌జీలతో మరిన్ని వస్తువుల తయారీ



మండలంలో ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులతో మరిన్ని వస్తువులు తయారు చేయించి మార్టులో అమ్ముతాం. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఫినాయిల్, యాసిడ్, పప్పుండలు వంటి వస్తువులను అమ్ముతున్నాం. ఇంకా పెంచుతాం. మార్టును మరింత అభివృద్ధి చేస్తాం.

–పి.సూరమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు

పోలీస్ సీజ్డ్ వాహనాల లెక్కలు పూర్తి

దంపింగ్ యార్డులో 2,300 వాహనాలు ఉన్నట్టు నిర్ధారణ



దంపింగ్ యార్డులో పోలీస్ సీజ్ వాహనాలు

మధురవాడ: వివిధ పోలీసు కేసుల్లో సీజ్ చేసి మధురవాడ శివశక్తినగర్ రోడ్డులో రైతుబజార్ పక్కన ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులో పడేసిన వాహనాల సంఖ్య 2,300గా అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. రెండు రోజులుగా చేపడుతున్న లెక్కింపు కార్యక్రమం శనివారం సాయంత్రానికి కొలిక్కి వచ్చింది. ఇక్కడ ఉన్న రెండు, మూడు, నాలుగ చక్రాలు వాహనాలు అన్నీ కలిపి 2,300 ఇక్కడ ఉన్నట్టు తేల్చారు. అయితే అధికార యంత్రాంగం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇక్కడ క్రైం డీసీపీ లతామాధురి పర్యవేక్షణలో ఏసీసీపీ మోహనరావు, ఏసీపీలు ఎ.వెంకటరావు, లక్ష్మణరావు, పీఎం పాలెం క్రైం ఇన్‌స్పెక్టర్ వీఎస్ఎస్ ప్రకాశ్ ఆధ్వర్యంలో నగరంలోని 22 క్రైం పోలీస్ స్టేషన్ల పరిధిలో 8మంది సీఐలు, 20మంది ఎస్ఐలు వాహనాల లెక్కింపు పనులు చేపట్టారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి



అప్పలనాయుడు (ఫైల్)

తగరపువలస: గడ్డి మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మధ్యాహ్నం కేజీహెచ్‌లో మృతి చెందాడు. సీఐ సీహెచ్ వాసునాయుడు తెలియచేసిన వివరాలివి.. ఆనందపురం మండలం వేములవలసకు చెందిన సారిక అప్పలనాయుడు, రమణమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్దకుమార్తె గర్భిణి కావడంతో ఈ నెల 10న విజయనగరం ఘోషా ఆస్పత్రిలో జాయిన్ చేశారు. అక్కడే ఆమె డెలివరీ కావడంతో తల్లి రమణమ్మ తోడుగా ఉండిపోయింది. ఈ నెల 15న అప్పలనాయుడు ఆస్పత్రికి వెళ్లి పౌర్ణమి కారణంగా కుమార్తెను డిశ్చార్జి చేస్తే, ఇంటికి తీసుకువెళ్తామని చెప్పగా వైద్యులు అంగీకరించలేదు. దీంతో భార్యతో వాదించిన అప్పలనాయుడు ఆమె దగ్గర నుంచి రూ.100 తీసుకుని వేములవలస వచ్చేశారు. అదేరోజు రాత్రి ఇంటి వద్ద గడ్డి మందు తాగడంతో, కాసేపటికి నోటి నుంచి నురుగులు కక్కుకుంటూ పడిపోయాడు. చిన్న కుమార్తె, నాన్నమ్మతో కలిసి తండ్రిని 108లో కేజీహెచ్‌కు చికిత్స కోసం తరలించారు. అప్పలనాయుడు చికిత్స పొందుతూ మృతి చెందడంతో, కేసు నమోదు చేసి ఏఎస్ఐ పైడిరాజు దర్యాప్తు చేస్తున్నారు. కూలిపనులు చేసుకునే తన భర్త మనస్థాపంతోనే గడ్డి మందు తాగినట్టు రమణమ్మ ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

3 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



రైస్ మిల్లులో బియ్యం పరిశీలిస్తున్న జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కర్

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం శ్రీబాలాజీ రైస్ మిల్లుపై శనివారం పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేసి 3 టన్నుల పీడీఎఫ్ బియ్యాన్ని సీజ్ చేశారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీ నిర్వహించినట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వి.భాస్కర్ తెలిపారు. మిల్లుపై 6ఎ కేసు నమోదు చేశామన్నారు. తనిఖీలో ఆయనతో అసిస్టెంట్ జిల్లా పౌరసరఫరాల అధికారి కల్యాణి, డీటీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు



ఆనందపురం హైస్కూల్లో సాహితీ సదస్సు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు మహేష్



మాట్లాడుతున్న రచయిత రాజేంద్రప్రసాద్ వర్మ

తగరపువలస: ఆనందపురం శాఖా గ్రంథాలయంలో జెడ్పీ హై స్కూల్ విద్యార్థులకు శనివారం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బి.వి.ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో 'ఆధునిక కవులు– రచనా శైలి' అనే అంశంపై సాహితీ సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించారు. సంధానకర్తగా ఉపాధ్యాయుడు మహేష్ వ్యవహరించారు.

చదువుతో విజ్ఞానం

భీమునిపట్నం: మంచి పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని కవి, రచయిత పొత్తూరి రాజేంద్రప్రసాద్ వర్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జరిగిన కవి సమ్మేళనం కార్యక్రమానికి విచ్చేసిన ఆయన పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. మన దేశంలో ఉన్నత స్థానాల్లో నిలిచిన వారందరూ పాఠ్యాంశాలతో పాటు సమాజానికి ఉపయోగపడే ఎన్నో రచనలను చదివి, స్ఫూర్తి పొందారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని, మంచి పుస్తకాలు పఠించాలని సూచించారు. గ్రంథాలయ అధికారి మహేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మత్స్యకారుల రిలే దీక్షలు

భీమునిపట్నం: తీరప్రాంత మత్స్యకారులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు డిమాండ్ చేశారు. బీచ్ ఆక్రమణలపై మత్స్యకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో మూడో రోజు శనివారం వారు పాల్గొని, మాట్లాడారు. తీరంలో అనేక ప్రాంతాల్లో ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. రసాయన పరిశ్రమల వ్యర్థాలు సముద్రంలో కలవడం వల్ల చేపలు చనిపోతున్నాయన్నారు. దీనిపై అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని, దీంతో ఈ ఆగడాలు మరింత పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి మత్స్యకారులను న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. దీక్షల్లో నాయకులు బర్రి కొండబాబు, పుక్కళ్ల ఎల్లాజీ, వాసుపల్లి అప్పన్న, వాడమొదల వీరన్న, సిరం శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి శోభాయాత్ర



అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహ ఊరేగింపు



ఊరేగింపులో కోలాటం, పేటతుళ్లి

తగరపువలస: స్థానిక శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి సేవాపీఠం ఆధ్వర్యంలో అయ్యప్పస్వాముల ఉత్సవ శోభాయాత్రను శనివారం సాయంత్రం నిర్వహించారు. స్వామి పంచలోహ విగ్రహాన్ని వాహనంపై ఉంచి, 18 మెట్లతో అలంకరించి చిట్టివలస, తగరపువలస వీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వాములు దారి పొడవునా అయ్యప్ప స్వామి నామస్మరణతో పువ్వులు చల్లుతూ ఉత్సాహంగా పేటతుళ్లి ఆడారు. ఈ శోభాయాత్రలో తీన్‌మార్, డీజే, బాణసంచా, కోలాటం, పులివేషాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధాన రహదారులు శరణుఘోషతో మార్మోగాయి.

విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ ప్రోత్సాహకాలు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీలో అన్నవరం హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేసింది. పంచాయతీలో టెన్త్, ఇంటర్మీడియట్, డిప్లమో, డిగ్రీ, బీటెక్‌లలో మొదటి మూడు స్థానాలు సాధించిన వారికి నగదు బహుమతులు, మిగిలిన విద్యార్థులకు బహుమతులు అందించారు. యాన్యువల్ బ్రైట్ ఫ్యూచర్స్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం–2024 పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థులంతా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నదే లక్ష్యంగా గ్రంథాలయాన్ని స్థాపించి అందులో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఉంచామన్నారు. బయట పోటీ పరీక్షల శిక్షణకు వెళ్లే విద్యార్థులకు అవసరమైతే రవాణా, కోచింగ్ ఫీజులు చెల్లించి అండగా ఉంటామన్నారు. ఈ అవకాశాన్ని పంచాయతీ విద్యార్థులు, అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు.

20 నుంచి సిద్ధేశ్వర స్వామి పీఠం స్వర్ణోత్సవాలు



కరపత్రం విడుదల చేస్తున్న ధర్మకర్త నరసింహమూర్తి తదితరులు

మధురవాడ: మధురవాడలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి పీఠం స్వర్ణోత్సవాలను ఈ నెల 20 నుంచి 3 రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు పీఠం ధర్మకర్త ఎ.నరసింహమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం కరపత్రం ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక కేంద్రంలో నూతన యాగశాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పీఠాన్ని 1974లో దివంగత సిద్ధేశ్వర స్వామి చేతుల మీదుగా ప్రారంభించి, 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పీఠంలోని అన్ని ఆలయాల్లో 20న విఘ్నేశ్వర పూజ, యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 21న 108 కలశాల స్థాపన, 22న హోమాలతో పాటు స్వాములకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు ఉంటాయన్నారు. సిద్ధేశ్వరి మాత, శ్రీ చక్రాలకు కుంకుమ పూజలు, దీపారాధన, లలితా సహస్రనామ పారాయణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దూసి రామలింగస్వామి శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయులకు ప్రయోగ పరీక్షలు

తగరపువలస: ఛాత్రోపాధ్యాయులకు రెండో సెమిస్టర్‌కు సంబంధించి అంత్య ప్రయోగ పరీక్షలు శనివారం 6 పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో భీమిలి డైట్ అధ్యాపకుడు సారిపల్లి త్రినాథరావు ఈ పరీక్షలు నిర్వహించారు.

తీరానికి కొట్టుకొచ్చిన తాబేలు



భీమిలి పార్కు వద్ద తీరానికి కొట్టుకు వచ్చిన తాబేలు

తగరపువలస: భీమిలి తీరానికి శనివారం సాయంత్రం అతి పెద్ద తాబేలు కళేబరం కొట్టుకు వచ్చింది. సాధారణ తాబేలు కంటే నాలుగు రెట్లు పెద్దగా ఉన్నట్టు ఈ ప్రాంత పర్యాటకులు తెలిపారు. లైట్ హౌస్ ఎదురుగా పర్యాటకులు తీరాన్ని ఆస్వాదిస్తుండగా ఈ తాబేలు కళేబరం కనిపించింది. కాలుష్యం కారణంగానే తరచూ తాబేళ్ల మృత్యువాత పడుతూ తీరం వెంబడికి చేరుతున్నట్టు స్థానికులు తెలిపారు.

కూటమి నేతల ఒత్తిడితోనే నిర్మాణం కూల్చివేత

- బదులుగా పంచాయతీ ఇచ్చిన స్థలంలో కట్టడం
- దుర్మార్గంగా కూల్చేశారని బాధితురాలి ఆవేదన



బొడ్డపాలెంలో రెవెన్యూ సిబ్బంది కూల్చివేసిన దాసరి సుశీలకు చెందిన నిర్మాణం

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలో కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుల పట్ల కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారు. అందుకు రెవెన్యూ సిబ్బందిని పావులుగా వాడుకుంటున్నారు. తాజాగా పంచాయతీ పరిధి బొడ్డపాలెం గ్రామంలో జరిగిన సంఘటన దీనికి బలం చేకూరుస్తోంది. ఈ గ్రామంలో బాధితురాలు దాసరి సుశీల కుటుంబ సభ్యులు 2004లో సర్వే నంబర్ 278/1లో సుమారు 150 గజాల స్థలాన్ని రోడ్డు నిర్మాణానికి గాను పంచాయతీకి ఇచ్చారు. ప్రతిఫలంగా ఇదే సర్వే నంబర్‌లోని గయాలుకు చెందిన 120 గజాలు సుశీల కుటుంబ సభ్యులకు గిఫ్ట్ సెటిల్‌మెంట్ కింద ఇచ్చారు. ఇందులో సుశీల భర్త వినోద్‌కు బీటీ రోడ్డు నుంచి 50 అడుగుల దూరంలో 40 గజాల స్థలం రాగా ఇటీవల అందులో రూ.3.50 లక్షలు వెచ్చించి పల్లపు ప్రదేశాన్ని ఎత్తు చేయించి పిల్లర్లు వరకు నిర్మాణం చేపట్టారు. ఇది కూటమి నాయకులకు కంటగింపుగా మారి ఆనందపురం తహసీల్దార్‌పై ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో బాధిత కుటుంబానికి సమాచారం లేకుండానే శుక్రవారం జేసీబీతో కూల్చినట్టు సుశీల వాపోయింది. తాము పంచాయతీకి ఇచ్చిన స్థలానికి ప్రతిఫలంగా రహదారికి దూరంగా పల్లపు ప్రదేశం ఇస్తే పైసా పైసా కూటడబెట్టుకొని అందులో కట్టుకుంటున్న నిర్మాణాన్ని కూటమి నాయకుల ఒత్తిడితో కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే గ్రామంలో రహదారిని ఆనుకుని చాలామంది దుకాణాలు తాత్కాలికంగా, శాశ్వతంగా నిర్మించుకున్నా రెవెన్యూ సిబ్బందికి కనబడలేదన్నారు. ఈ విషయాన్ని ఆర్ఐ ఉమాదేవిని వివరణ కోరగా తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలతోనే కూల్చివేశామన్నారు. అనుమతి లేకుండా నిర్మాణం చేపట్టవద్దని సుశీలకు ముందే చెప్పామన్నారు.

26 వరకు గిరిజన గౌరవ దినోత్సవాలు



మొక్కలు నాటుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి మంద

కొమ్మాది: స్వాతంత్య్ర పోరాటంలో గిరిజన స్వాతంత్య్ర సమర యోధుల త్యాగాలను, వారి సేవలను స్మరించుకుంటూ జన జాతీయ గౌరవ దివస్ (జేజేజీడీ) గిరిజన గౌరవ దినోత్సవ వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు రుషికొండలోని గిరిజన సాంస్కృతిక శిక్షణ భవన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాణి మంద మొక్కలు నాటి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. గిరిజన స్వాతంత్య్ర సమర యోధుల నిస్వార్థ త్యాగాలను, దేశం కోసం వారి బలిదానాలను స్మరించుకుంటూ నిర్వహించే ఈ ఉత్సవాలు 26వ తేదీ వరకు కొనసాగుతాయని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా రుషికొండ, ఆర్‌కే బీచ్ ప్రాంతాల్లో కార్నివాల్, గిరిజన హస్తకళ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యాసరచన, పాటలు, క్రీడలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

8వ వార్డులో అడిషనల్ కమిషనర్ పర్యటన



ఎండాడలో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులో శనివారం సాయంత్రం అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ ఆకస్మికంగా పర్యటించారు. సాగర్‌నగర్, అల్లూరి సీతారామరాజు దుకాణ సముదాయాల్లో ప్లాస్టిక్ కవర్లను తనిఖీ చేశారు. ఈ ప్రాంతంలో పలు రోడ్లను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండటంతో శానిటరీ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఎండాడ డబుల్ రోడ్డులోని ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సెంటర్‌కు గేట్ ఏర్పాటు చేయాలని, అదే విధంగా సెంటర్ వెనుక భాగంలోని వ్యర్థాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో యువకుల ప్రతిభ



కప్పు గెలుచుకున్న యువకులు

కొమ్మాది: శ్రీకాకుళం జిల్లాలో ఈ నెల 10 నుంచి 13 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో విశాఖపట్నం జిల్లా జట్టు రెండో స్థానం కైవసం చేసుకుంది. సాగర్‌నగర్ బాస్కెట్‌బాల్ అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారులు రితిల్, కేతన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి విజయంలో కీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన కనపరిచిన క్రీడాకారులను శనివారం సాయంత్రం సాగర్‌నగర్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో కాలనీ పెద్దలు, నాయకులు అభినందించారు. వీరిలో రితిల్ ఈ నెల 20 నుండి 26 వరకు పంజాబ్‌లో జరగనున్న ఎస్‌జీఎఫ్ యు–19 జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు.

నేడు గౌరీ వివాహ పరిచయ వేదిక

కొమ్మాది: గౌరీ ఉచిత వివాహ పరిచయ వేదికను సాగర్‌నగర్ ది కోస్ట్ రిసార్ట్ వద్ద ఆదివారం నిర్వహించనున్నట్లు గౌరీ సేవాసంఘం ప్రతినిధి పెంటకోట సత్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఈ పరిచయ వేదిక ప్రారంభమవుతుందని, ఆర్థిక స్థోమత లేని ఆడపిల్లలకు ట్రస్ట్ ద్వారా వివాహ నిమిత్తం సహాయం చేస్తామని పేర్కొన్నారు.